కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

అంబర్‌పేట: స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌చే నియామకం చేపట్టే జీడీ అండ్ ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్, సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్ వంటి ఉద్యోగాల భర్తీకి కావాల్సిన శిక్షణను అర్హులైన నిరుద్యోగులకు ఉచితంగా అందించనున్నారు. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్ సంస్థల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగ నియామకానికి కావాల్సిన నైపుణ్యాలను ఉచితంగా శిక్షణ అందించడం జరుగుతుంది. ఉచిత భోజనం, వసతి, కావాల్సిన నైపుణ్య శిక్షణ నిపుణులతో ఇవ్వనున్నట్లు రాంకీ ఫౌండేషన్ చైర్మన్ మువ్వ రాంరెడ్డి, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ప్రతినిధులు గద్దె భాస్కర్, సందీప్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 12 నుంచి 22వ తేదీ లోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 26వ తేదిన హైదరాబాద్, గుంటూరులో అర్హత పరీక్ష నిర్వహించి ఉచిత శిక్షణ తరగతులకు అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఈ ఉచిత శిక్షణ తెలంగాణలో 300, ఆంధ్రప్రదేశ్‌లో 300 మందికి ఎంపిక చేసి శిక్షణ అందిస్తామన్నారు. వీరికి 5 నెలల పాటు ఉద్యగ ఎంపికకు కావాల్సిన అన్ని అంశాల్లో మేరుగైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం సంస్థ ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్)లతో పాటు ఫోన్స్: 97036 51233, 73375 85959, 90007 97789లలో సంప్రదించాలన్నారు.

దంత సంరక్షణపై అవగాహన అవసరం

నల్లకుంట: దంత సంరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని దత్త సాయి మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎం.ఎస్.రంగారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నారుల దంత సమస్యలపై నిర్లక్ష్యం చేయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని సోమవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా సమీపంలోని దత్త సాయి మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్‌లో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆస్పత్రి ఇంచార్జీ డాక్టర్ ఎం.ధనేశ్వరితో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. వందలాది మంది దంత పరీక్షలు చేయించుకున్నారని, అవసరమైన వారికి ఉచితంగా టూత్ పేస్టులు అందజేశామని ఆయన తెలిపారు.

ప్రచారం ముమ్మరం.. విజయంపై ధీమా!

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. నామినేషన్ల పరిశీలన పూర్తి కావడంతో బరిలో దాదాపు అందరు అభ్యర్థులూ ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో ఎవరి బలాబలాలను అంచనా వేసుకుంటూ ప్రచారంలో ముందుకు వెళ్తున్నారు. – ముషీరాబాద్, అంబర్‌పేట

అభివృద్ధే గెలిపిస్తుంది: బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్


వైఎస్సార్ పార్కు వద్ద ప్రచారంలో పాల్గొన్న ముఠా గోపాల్, ముఠా జైసింహ తదితరులు

ముషీరాబాద్: గడచిన ఐదేళ్లలో ముషీరాబాద్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి, ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ముషీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ పేర్కొన్నారు. ముషీరాబాద్ డివిజన్ వైఎస్సార్ పార్కు, ఈస్ట్ ఎంసీహెచ్ కాలనీ, బాపిస్ట్ చర్చి, ఆదర్శనగర్ తదితర ప్రాంతాలలో సోమవారం ముఠా జైసింహతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ గత ఐదేళ్ల కాలంలో వారికి తాను చేసిన అభివృద్ధి గురించి చెప్పుకుంటూ ప్రచారాన్ని సాగించారు. కొంతమంది మహిళలు, స్థానికులు ముఠా గోపాల్‌కు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో 1.08 లక్షల మంది సీఎం రిలీఫ్, పింఛన్‌లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కంటి వెలుగు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వంటి పథకాల ద్వారా లబ్ధిపొందారన్నారు. వీరంతా తన సైన్యమని వారే మరికొందరికి చెప్పి తన విజయం కోసం కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేసి చూపించామని నగరానికే తలమానికంగా స్టీల్ బ్రిడ్జి నిర్మాణం, ఇందిరాపార్కులో అంతర్జాతీయ ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్, బస్తీ దావాఖానాలు, ఇండోర్ స్టేడియాలు, రోడ్లు వంటి ఎన్నో వాటిని అభివృద్ధి చేశానన్నారు. డివిజన్ అధ్యక్షులు నర్సింగ్‌ప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్, ఎన్నికల ఇన్‌చార్జీ కొండపల్లి మాధవ్, శ్రీధర్‌గౌడ్, రజనీ, ప్రేమలతరెడ్డి, రాజ్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్, శివముదిరాజ్ పాల్గొన్నారు.

ముషీరాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా: కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్


మాట్లాడుతున్న అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: ఎమ్మెల్యేగా గెలిపించి ముషీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం భోలక్‌పూర్‌లోని పద్మశాలి కాలనీ, ఎస్‌బీఐ కాలనీ తదితర ప్రాంతాలలో కాలనీ పెద్దలను కలిసి కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్‌యాదవ్ పద్మశాలి కాలనీ పెద్దలతో సుదీర్ఘ మంతనాలు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తాను ఎంపీగా ఉన్నప్పుడు ముషీరాబాద్‌ను ఎంతో అభివృద్ధి చేశానని, ఈసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. కాలనీలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని, అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ న్యాయం చేస్తుందని అన్నారు. ఆరు గ్యారంటీ పథకాలకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నదన్నారు. బీసీలంతా కాంగ్రెస్‌కే మద్దతు ఇస్తున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేస్తుందని అన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన ప్రజలకు ఆర్థిక సాయం సైతం అందజేస్తుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు, కేటీఆర్, హరీష్‌రావు, ఎమ్మెల్సీ కవితలు రాష్ట్రంలో ఓడిపోతామనే భయంతో సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతూ అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు వారి మాయమాటలు నమ్మే స్థితిలో లేరని కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్, పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సుందర్ పటాలే, ఆర్.ఆంజనేయులు, నాయకులు శ్రీనివాస్, కమల్‌కుమార్‌శర్మ, సుజాత పాల్గొన్నారు.

రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే: అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


నర్సింహబస్తీలో కాలేరు వెంకటేష్ మంగళహారతులు ఇస్తున్న మహిళలు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఏర్పాటు అవుతుందని.. ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని అంబర్‌పేట ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం గోల్నాక డివిజన్ కృష్ణానగర్ బస్తీలో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలోని అన్ని హామీలను అమలు పరుస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీలు పూటకోమాట చెపుతూ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని, వారి మాటలు నమ్మితే అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

నల్లకుంటలో...

నల్లకుంట: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేష్ నల్లకుంట డివిజన్ పరిధిలోని నర్సింహాబస్తీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లిన ఆయనకు స్థానిక మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయల వ్యయంతో తాను చేపట్టిన అభివృద్ధి పనులు, బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి నాకు ఓటేసి గెలిపించాలని స్థానిక ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎం.భూపతినాథ్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తోడు దొంగలు: డాక్టర్ లక్ష్మణ్


ప్రచారం చేస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ అభ్యర్థి పూస రాజు

ముషీరాబాద్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు రెండూ తోడుదొంగలే అని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ అమ్ముడు పోయే పార్టీ.. బీఆర్‌ఎస్ కొనుగోలు చేసే పార్టీ అని విమర్శించారు. ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పి బీజేపీ అభ్యర్థి పూసరాజును గెలిపించాలని ఆయన కోరారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్, గంగపుత్ర కాలనీ, కమలా నెహ్రూనగర్‌లలో బీజేపీ అభ్యర్థి పూసరాజు, డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌తో కలిసి లక్ష్మణ్ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ బీజేపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జీ చంద్రమౌళి, నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచికుమార్, ఓబీసీ మోర్చా రాష్ట్ర సభ్యులు జమాల్‌పురి నందు, నాయకులు మెట్టు వాసు, సత్యనారాయణ, సురేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదు: తేజాగౌడ్



ముషీరాబాద్: తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని టీ పీసీసీ ఓబీసీ స్టేట్ కో ఆర్డినేటర్ తేజాగౌడ్ స్పష్టం చేశారు. సోమవారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్ పార్టీని వీడుతున్న సందర్భంగా ఆయనను పార్టీని వీడొద్దని చెప్పడానికే ఆయన వద్దకు వెళ్లానని కానీ నేను కూడా పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరుగుతున్నదన్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ వాదినే అయిన నేను పార్టీని వీడనని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు.

బీఆర్‌ఎస్ వెంటే ముస్లింలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఇన్‌చార్జి

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో ముస్లింలు బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని ముషీరాబాద్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జీ, ఎమ్మెల్సీ ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం ముషీరాబాద్ ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, మరో ఎన్నికల ఇన్‌చార్జీ కన్నాయాదవ్, ముస్లిం మైనార్టీ నాయకులు షరీఫ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఉపయోగించుకుంటున్న వారిలో ముస్లిం, మైనార్టీలే అధికంగా ఉన్నారని తెలిపారు. ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వారి అభివృద్ధికి కేటాయించిన బడ్జెటే అందుకు నిదర్శనమన్నారు.

'మాదిగలను మరోసారి మోసం చేసిన బీజేపీ'

ముషీరాబాద్: మాదిగ జాతిని బీజేపీ మరోసారి మోసం చేసిందని, ఎన్నికల సమయంలో కొత్త రాజకీయ డ్రామాలకు తెరతీశారని బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకుడు ఎం.ఎన్.శ్రీనివాస్‌రావు ఆరోపించారు. 1980లో అప్పటి తిరుగులేని దళిత నాయకుడు బాబు జగ్జీవన్‌రామ్‌ను ప్రధాని అభ్యర్థిగా నిలబెడితే జనతా పార్టీ కూటమి నుంచి బీజేపీ వైదొలగి ఆయనను ప్రధాని కాకుండా అడ్డుకున్న చరిత్ర బీజేపీదే అని స్పష్టం చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న దళిత నాయకుడు బంగారు లక్ష్మణ్‌ను అవినీతి ఆరోపణల పేరుతో ఆయన పరువును బజారుకు ఈడ్చింది కూడా బీజేపీనే అని స్పష్టం చేశారు. అలాంటి బీజేపీ ఎస్సీలకు వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి నేడు కమిషన్ వేస్తానని ప్రకటించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు రాష్ట్రంలో బీసీ జపం చేస్తున్నారని రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ వ్యక్తిని తొలగించి ఓసీకి అప్పగించారని ఎద్దేవా చేశారు.

బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు వెంకటకృష్ణారావు ఆధ్వర్యంలో సోమవారం రాంనగర్ డివిజన్‌లోని అచ్చయ్యనగర్‌లో సుమారు వంద మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ మాట్లాడుతూ... ఇది ప్రజల ప్రభుత్వం అని దేశంలో ఎక్కడ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అందుకే వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు రావుల మోజెస్, ప్రధాన కార్యదర్శి ఎం.దామోదర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సి.రాజేంద్రప్రసాద్‌గౌడ్, వి.నాగభూషణం, ఎ.కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి బీఆర్‌ఎస్‌ను గద్దెదించాలి: కృష్ణయాదవ్



నల్లకుంట: రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వం రాజ్యమేలుతోంది, ఈ పార్టీకి ప్రజలు ఓటు అనే ఆయుధంతో తగిన విధంగా గుణపాఠం చెప్పాలని అంబర్‌పేట ఎమ్మెల్యే అభ్యర్థి సి.కృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. బీజేపీ ఉమ్మెల్యే అభ్యర్థి సి. కృష్ణ యాదవ్ సోమవారం సాయంత్రం నల్లకుంట డివిజన్ పరిధిలోని న్యూనల్లకుంట హన్‌మాన్ ఆలయం, బ్రాహ్మణ హాస్టల్ వీధి, హ్యాపీ హోమ్ అపార్ట్‌మెంట్, మదర్ డైరీ పార్కు లేన్, సరేంద్ర పార్కు తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం చేశారు. కార్పొరేటర్ వై.అమృత తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి


చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాబు

చిక్కడపల్లి: ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా శాంతిభద్రల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ తెలంగాణ చైర్మన్ డాక్టర్ గిడియోన్ బాబు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించిన సీతయ్యను సోమవారం కలసి అభినందించారు. శాంత్రిభద్రతల పరిరక్షణలో ప్రజల నుంచి సంపూర్ణ సహాయ సహకారాలను అందించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ నియోజవర్గాల్లో బీఆర్‌ఎస్ విజయం కోసం కృషి

చిక్కడపల్లి: రాష్ట్రంలోని 18 ఎస్సీ, 8ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజవర్గాల్లో పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్), మహాజన పోరాట సమితి (ఎమ్‌ఎస్‌పి) మద్దతు తెలిపి వారి గెలుపుకు కృషి చేస్తామని ఆసంస్థల వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బీఎస్ రమేష్‌కుమార్ మాదిగ తెలిపారు. సోమవారం గాంధీనగర్ డివిజన్‌లోని ముషీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఎన్నికల కార్యాలయంలో జరిగిన సమావేశంలో రమేష్ మాదిగ మాట్లాడారు. ముషీరాబాద్ అభ్యర్థి ముఠాగోపాల్ భారీ మెజార్టీతో విజయం సాధించేందుకు తాము ప్రచారం చేస్తామని ఆయన తెలిపారు. కాలయాపన కోసమే ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్ర బీజేపీ ప్రభుత్వం కమిషన్, కమిటీలు వేస్తామని ప్రకటిస్తుందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్ వర్గీకరణ విషయాన్ని పరిష్కరిస్తారనే నమ్మకం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్, ఎస్సీ, ఎస్సీ, బీసీ, మైనార్టీఏ వర్గాలను కలుపుకుని రాష్ట్ర సాధనంకు కృషి చేశారని తెలంగాణ సాధించారన్నారు. ఉద్యమంలో కేసీఆర్ ఎస్సీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కలుపుకుని రాష్ట్ర సాధనకు కృషి చేశారని... తెలంగాణ సాధించారన్నారు. అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రతి పేద వర్గానికి ఎంతో మేలు చేస్తున్నారన్నారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చూడాలనే ఉద్దేశ్యంతో మద్దతు ప్రకటిస్తున్నామన్నారు.

'ఓటు వేయండి-దేశాభివృద్ధికి పాటుపడండి'


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనునాయుడు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రముఖ సంఘ సేవకుడు జి.శ్రీనునాయుడు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం రాంనగర్‌లో ఓటు ప్రాధాన్యత, ఓటు విలువ గురించి జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఓటరు తమ ఓటు విలువను తెలుసుకోవడంతో పాటు అన్ని రాజకీయ పార్టీల మేనిఫెస్టోను తప్పకుండా చదవాలని కనీసం తెలుసుకోవాలని కోరారు. ప్రస్తుతం విద్య, వైద్యం కోసం పాటుపడే పార్టీలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉన్నత చదువుల కోసం ఎంతో మంది యువకులు విదేశాలకు వెళ్తున్నారని అక్కడికి వెళ్లి ఉద్యోగాలలో స్థిరపడి మాతృదేశం వైపు చూడని పరిస్థితి ఉందని తల్లిదండ్రులు చనిపోయినా రాలేని పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. అదే స్వదేశంలోనే ఉన్నత విద్యా అవకాశాలు కల్పిస్తే వారి శక్తిసామర్థ్యాలను భారతదేశానికే ఖర్చు చేసేవారని తెలిపారు. హోటల్స్, క్రికెట్, సినిమా థియేటర్ టికెట్ల కోసం తమ వంతు వచ్చేంత వరకు గంటల తరబడి వేచి చూస్తామని కానీ ఓటు వేసేందుకు పది నిమిషాలు లైన్‌లో నిలబడేందుకు యవత ఇష్టపడటం లేదని విచారం వ్యక్తం చేశారు. విద్యావంతులు తప్పకుండా లైన్‌లో నిలబడి ఓటు వేయాలని కోరారు. ఈ ఓటు వేసే విషయంపై పాఠశాలలు, కళాశాలల్లో తిరుగుతూ అవగాహన కల్పిస్తామన్నారు.

బీజేపీతోనే పేదల రాజ్యం

చిక్కడపల్లి: తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని బీ జేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. గడీల పాలనను బద్దలు కొట్టి పేదల రాజ్యం బీజేపీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశా రు. సోమవారం రాత్రి గాంధీనగర్ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి పూస రాజుకు మద్దతుగా కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్‌తో కలసి ఆయన ఎన్నికల ప్ర చారం నిర్వహించారు. డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ... పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు ఉన్న పొలాన్ని అమ్ముకుని హైదరాబాద్‌కు పంపించి ఉద్యోగాలకు సిద్ధం చేస్తే నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగులకు అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జిల నియామకం

కవాడిగూడ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్ ఇన్‌చార్జిలుగా ఆ పార్టీ సీనియర్ నాయకులు గోక నవీన్, జునేద్‌బాగ్దాదీలను సోమవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ నియమించారు. వారు మాట్లాడుతూ... కవాడిగూడ డివిజన్‌లో బూత్‌స్థాయిలో పటిష్టం చేస్తూ ప్రభుత్వ పథకాలను పొంది లబ్ధిదారులను నేరుగా కలిసి సంక్షేమ పథకాలను గడప గడపకు ప్రచారం చేస్తూ బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

నడుస్తున్న రైలులోకి ఎక్కి ప్రయాణికురాలి గొలుసు స్నాచింగ్

కాచిగూడ: స్పెషల్ రైలులోని ప్రయాణికురాలి బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప సమాచారం మేరకు... కర్నూలు ప్రాంతానికి చెందిన గోపీనాథ్ భార్య ప్రభావతి(39) సోమవారం నాగర్‌సోల్-కర్నూలు స్పెషల్ రైలు కాచిగూడకు వస్తుండగా మార్గమధ్యంలో సీతాఫల్‌మండీ రైల్వే స్టేషన్‌లో స్లోగా వెళ్తుండటంతో గుర్తుతెలియని దుండగులు రైలులోకి ప్రవేశించి ప్రభావతి మెడలో ఉన్న 25 గ్రాముల బంగారు ఆభరణాలను లాక్కొని పారిపోయారు. ఈ మేరకు బాధితురాలు ప్రభావతి కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ తెలిపారు.

ఆది పురుషుడు వాల్మీకి మహర్షి


వాల్మీకికి నివాళులర్పిస్తున్న ఇనాక్, వీడీ రాజగోపాల్, వీఎస్ రావు, తలారి శంకర్, రవీంద్రబాబు

చిక్కడపల్లి: బోయజాతిలో జన్మించి రామాయణ మహా కావ్యరచన చేసిన వాల్మీకి మహర్షి భారతీయ సంస్కృతికి ఆది పురుషుడు అని ఎస్వీ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో, వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు, భూగర్భగనుల శాఖ రిటైర్డ్ డైరెక్టర్ వీడీ రాజగోపాల్ పర్యవేక్షణలో సినీపాటల గానం, చింతామణి నాటక ప్రదర్శన, వాల్మీకి విశేషాల కవిసమ్మేళనం అద్భుతంగా జరిగింది. శరత్ చంద్ర రామాయణ ఆధారిత నేపథ్యంలో సినీ పాటలను సహ గాయకులతో కలసి ఆలపించారు. రత్నాశ్రీ చింతామణిగా, సాంబిరెడ్డి భవానీ శంకరంగా చింతామణి నాటకంలోని చింతామణి భవానీల సంభాషణల దృశ్యాన్ని ప్రదర్శించారు. వాల్మీకి గురించిన విశేషాలపై జరిగిన కవి సమ్మేళనం వైవిధ్యభరితంగా జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులు పలువురు స్వీయ కవితలను చదివారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రొఫెసర్ ఇనాక్ మాట్లాడుతూ... రామాయణం అదికావ్యం అని భారతీయ ఆధ్యాత్మిక సాంస్కృతిక నైతిక విలువ సంపద అని అన్నారు. అట్టి మహాకావ్యరచన చేసిన వాల్మీకి జయంతి ప్రతి ఏటా ముందు తరాలు విస్మరించకుండా ఉండేందుకు చేయాలని కోరారు. వాల్మీకి ఏ ఒక్కజాతి ప్రతినిధి కాదని భారతీయ సంస్కృతికి మూలమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు సత్కారం రాజగోపాల్ సారథ్యంలో జరిగింది. సంస్థ ప్రతినిధులు డాక్టర్ వీఎస్ రావు, తలారి శంకర్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో ఏడుగురి నామినేషన్ల తిరస్కరణ

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. సోమవారం ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో ఆర్‌ఓ అపర్ణ ఎన్నికల అధికారులతో కలిసి అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను పరిశీలించారు. 27 మంది నామినేషన్లను పరిశీలించి ఏడుగురి నామినేషన్లను తిరస్కరించారు. సరైన నమూనాలో వాటిని దాఖలు చేయకపోవడంతో వాటిని తిరస్కరించినట్లు వారు పేర్కొన్నారు. తిరస్కరించిన వారిలో సింగిరెడ్డి నందితా, ఫిరీమా బేగం, రమేష్ కొల్లూరు, పొన్నపాటి చిన్న లింగన్న, ఎనుగుల వెంకట నారాయణ, గంధమల్ల నిర్మల ఉన్నారు.

ముషీరాబాద్‌లో.. రెండు

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో 35 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా సోమవారం జరిగిన నామినేషన్ల పరిశీలనలో ఇద్దరు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు ముషీరాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఇండిపెండెంట్ అభ్యర్థి సగరం అనిల్ కుమార్‌ను బలపరిచిన వ్యక్తులకు సంబంధించిన అడ్రస్‌లు ముషీరాబాద్ నియోజకవర్గంలో లేనందున తిరస్కరించామన్నారు. బీజేపీ తరపున నామినేషన్లు వేసిన రామిరెడ్డి స్నేహారెడ్డి ఏ, బీ ఫారంలు దాఖలు చేయనందున నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఆర్‌వో వివరించారు.

నేటి నుంచి కార్తీకమాస పవిత్రోత్సవాలు

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాస పవిత్రోత్సవాలు మంగళవారం నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఈవో మాచర్ల దేవనాథం, పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ బాసాని పద్మ తెలిపారు. రోజూ ఉదయం 7 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకాలు, సాయంత్రం ఆకాశ దీపోత్సవం ఉంటుందన్నారు. ప్రతి సోమవారం ఏకాదశ రుద్రాభిషేకాలు ఉంటాయన్నారు. మంగళవారం నుంచి, 12 వరకు, డిసెంబర్ 4న సాయంత్రం ప్రదోషకాల పూజ, ఈ నెల 24న శ్రీకృష్ణతులసి కల్యాణం, 25న శని తిల తైలాభిషేకాలు, 26న జ్వాలాతోరణ, సహస్ర దీపాలంకరణ, 30న అరుద్ర నక్షత్రం పురస్కరించుకుని రుద్రహోమం, డిసెంబర్ 11న సాయంత్రం శ్రీ శివకల్యాణోత్సవం ఉంటుందని వివరించారు.

నేడు సదర్ సమ్మేళనం

కాచిగూడ: తెలంగాణ యాదవ సదర్ సమ్మేళనం ఆధ్వర్యంలో మంగళవారం నారాయణగూడలో సదర్ సమ్మేళనాన్ని నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు హాజరు కావాలని కోరుతూ నిర్వాహకులు జంగాల అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం మంత్రి తలసానిను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

రిసాల కుర్షిద్‌జాయిలో ..

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని రిసాలకుర్షిద్‌జాయి బస్తీలో పింజర్ల కుటుంబం ఆధ్వర్యంలో సదర్ వేడుకలు మంగళవారం సాయంత్రం 6 గంటలకు జరుగుతాయని పింజర్ల శంకరయ్యయాదవ్, రవీందర్‌యాదవ్, బాలరాంయాదవ్, కృష్ణయాదవ్ తెలిపారు. వేడుకల్లో భాగంగా సోమవారం రిసాల కుర్షిద్‌జాయిలో సదర్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మంగళవారం సాయంత్రం సదర్ వేడుకలు రిసాల నుంచి ప్రారంభమై రాంనగర్ చౌరస్తా అనంతరం నారాయణగూడలో జరిగే వేడుకలకు తమ బృందం తరలివెళ్తుందన్నారు.

నింబోలిఅడ్డాలో సందడిగా సదర్


వేడుకల్లో పాల్గొన్న కిషన్‌రెడ్డి

కాచిగూడ: అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో నింబోలిఅడ్డ మహాకాళీ ఆలయ చౌరస్తాలో ఆదివారం రాత్రి సదర్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కాచిగూడ, గోల్నాక, అంబర్‌పేట, నూర్‌ఖాన్ బజార్, ముషీరాబాద్, ఖైరతాబాద్, గోషామహల్, మలక్‌పేట తదితర ప్రాంతాల నుంచి సుమారు 50 వరకు దున్నలు ఉత్సవాలకు వచ్చాయి. దున్నల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్సవాలకు హాజరైన దున్నల యజమానులకు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ మంత్రి, బీజేపీ నేత సి.కృష్ణయాదవ్, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, నేతలు బి.బాబురావు యాదవ్, ఆర్.లక్ష్మణ్ యాదవ్, పాండుయాదవ్, మహేందర్ యాదవ్, ఎస్.శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శంకరమఠంలో శారదాంబకు విశేష పూజలు



నల్లకుంట: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నల్లకుంటలోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. నల్లకుంట శంకరమఠంలో శక్తి గణపతికి ఆదిపూజలు నిర్వహించి చంద్రమౌళీశ్వర స్వామికి విశేష పూజ లు చేశారు. మాతకు కుంకుమార్చనలు, ప్రత్యేక పజలు నిర్వహించారు.

ఏఐసీడబ్ల్యూసీ రాష్ట్ర నూతన కార్యవర్గం


సభ్యులకు నియామక పత్రాలు అందజేసిన అతిథులు

నల్లకుంట: ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ (ఏఐసీడబ్ల్యూసీ) జాతీయ కార్యదర్శి ఎం.ఐజాక్ రాజ్ ఏఐసీడబ్ల్యూసీ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. ఏఐసీడబ్ల్యూసీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జాన్ సైదులు, కేతన్ పటేల్, కార్యదర్శిగా శ్రీధర్ రావు పార్వతి, సంయుక్త కార్యదర్శిగా అయ్ సోకర్, కార్యదర్శిగా ఆగస్టిన్ రాజు, తెలంగాణ సోషల్ మీడియా కన్వీనర్‌గా సమీకాన్ నియమితులయ్యారు. సో మవారం నల్లకుంటలో ఏఐసీడబ్ల్యూసీ కార్యాలయంలో కౌన్సిల్ రాష్ట్ర కా ర్యవర్గ సమావేశం జరిగింది. అతిథిగా హాజరైన ప్రముఖ సంఘ సేవకుడు, జాతీయ చైల్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ చైర్మన్ సాంబశివ రావు ఏఐసీడబ్ల్యూసీ రాష్ట్ర నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని చిక్కడపల్లి ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు సింగారపు రమేష్‌గుప్తా అన్నారు. సోమవారం చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మరేష్‌గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్నదానాల్లో కన్నా అన్నదానం గొప్పదన్నారు. అన్నదాతలు ప్రొద్దుటూరి నరసింహారావు, గుడిశెట్టి శంకరయ్య, వారణాశి గాలయ్య, సంఘం ప్రధాన కార్యదర్శి చేపూరి లక్ష్మణ్, కోశాధికారి సి.హెచ్.శ్రీనివాస్, అదనపు కార్యదర్శి ఎ.బాలకుమార్, ప్రాజెక్టు చైర్మన్ టి.రవీందర్‌గుప్తా, సభ్యులు పల్లెర్ల రమేష్, సురేందర్‌గుప్తా, బాలచందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.